ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్



డ్రగ్స్, గంజాయి విక్రయాలను నిర్మూలించాలని నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

బాలానగర్: భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు అనగంటి వెంకటేష్, మేడ్చల్ జిల్లా నాయకుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి చైతన్యరెడ్డి హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ... నేటి విద్యార్థులు, యువత గంజాయికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఆల్కహాల్ తరువాత ఎక్కువ మంది గంజాయికి వ్యసనపరులుగా మారుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయిని నిర్మూలించే విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినా గంజాయి విక్రయదారులు రెచ్చిపోతున్నారన్నారు.

◆ ఇటీవలి కాలంలో గంజాయితో పట్టుబడ్డ నిందితుల్లో ఎక్కువగా విద్యార్థులు ఉండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోందని అన్నారు. నేటి యువత మొదట మత్తు కోసం... తర్వాత డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతూ.. గంజాయి విక్రయిస్తూ వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీమాన్, ఉపాధ్యక్షులు మల్లేష్, నరేష్, సహాయ కార్యదర్శులు వంశీ, అభి, రాజు, కోశాధికారి బన్నీ, కమిటీ సభ్యులు టైని, సాయిసాగర్, అనిల్, సాయికుమార్, మురళి, లక్ష్మణ్, రాజేందర్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఆల్విన్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఉప్పల విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్‌ను ఆదివారం ఎన్ఎస్‌యూఐ నాయకులు కలిశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షులు దుర్గ ముదిరాజ్, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, నాయకులు వికాస్, శివ, సాయి, రోహిత్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అందుకు ఎన్ఎస్‌యూఐ నాయకుల సహకారం సైతం ఉండాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు


గూడ్స్ షెడ్‌రోడ్డులో చెత్త వేసే ప్రాంతంలో 'చాయ్ పే చర్చ'లో మున్సిపల్ సిబ్బంది

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో స్థానికులు చెత్త పడవేసే ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది ఆదివారం చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జీవీపీ పాయింట్ల దగ్గర యూబీడీ వారి సహకారంతో మొక్కలు నాటాలన్నారు. అనంతరం ముగ్గులు వేసి సీనియర్ సిటిజన్లతో కలిసి చాయ్ తాగారు. స్థానికులు చెత్తను రోడ్లపై, కూడళ్ల ప్రాంతాల్లో వేయకుండా వారికి అవగాహన కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి వచ్చే చెత్తను సేకరించే వాహనంలోనే చెత్తను అందించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

మూసాపేట: మూసాపేటలోని గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్‌హాల్ వద్ద కాంగ్రెస్ నేత చున్నూ పాషా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి ఉచితంగా షుగర్, థైరాయిడ్, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూసాపేట పరిసర ప్రాంతాల్లో ప్రతి వారానికి ఒక్కసారి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ముస్సి, డాక్టర్ రజిత, ప్రవీణ్, శ్రీకాంత్, రాకేష్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము సచిన్‌కుమార్, టింకు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన సంగీత విభావరి

మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సప్తస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాహి పాహి, రామ రామ, మారుతీ మారుతీ, గేమ్ గేమ్ గణపతి తదితర భజనలను, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపించి అలరించారు. కళాకారులు నిత్యకమలాశ్రీ నందు, ఆముక్త, శ్రీహిత, శ్రీనిక, యువన్, యాషిక, శ్రీవిద్య, కార్తీక్, పూజిత, వేదశ్రీ, గౌరీ తదితరులు పాల్గొని ఆలపించారు. వినాయకకౌతం, రామాయణశబ్దం, ఆధ్యాత్మ రామాయణ కీర్తన తదితర అంశాలను శ్రీనిధి, మహతి, మైథిల్యా ప్రదర్శించి అలరించారు.

ఆగిన డ్రైనేజీ పైపులైన్ పనులు..

ఆగని మురుగు ప్రవాహం


కేపీహెచ్‌బీ ఫేజ్-3లో రోడ్డుపై పారుతున్న మురుగు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్‌లు దెబ్బతినటంతో లీకేజీలు ఏర్పడి మురుగు రోడ్డుపై పారుతోంది. కేపీహెచ్‌బీ 3వ ఫేజు ఎల్ఐజీ ప్రాంతం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద డ్రైనేజీ పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ పనులకు నిధులు మంజూరై శంకుస్థాపన కూడా చేశారు. అయినా పనుల్లో జాప్యం జరుగుతోంది. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని అధికారులు తెలుపుతున్నారు. పనులు పూర్తి కాకపోవటంతో స్థానికులతో పాటు వాహనదారులు, పాదచారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కటింగ్ సమస్య ఉందని వాటికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు లభించినా అనంతరం పనులు ప్రారంభిస్తామని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

◆ అంతేకాకుండా డ్రైనేజీ పైపుల నుంచి నీరు వెనక్కు వచ్చి ఇళ్లల్లో ప్రవేశిస్తుండటంతో ఆ నీటి నుంచి వచ్చే దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. రానున్న వర్షాకాలానికి ఈ సమస్య తీవ్రమవుతుందని, పనుల్లో కూడా జాప్యం ఏర్పడుతుందన్నారు. వేసవి కాలం పూర్తికాక ముందే అధికారులు డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

హెచ్ఏఎల్ పార్కు

- రాత్రి సమయంలో పార్కు ఆవరణలో యువకుల హడావిడి
- నిబంధనలకు విరుద్ధంగా మద్యంతో పాటు తినుబండాల విక్రయాలు
- గుంపులు గుంపులుగా తెల్లవారుజాము వరకు తిష్ట వేస్తున్న వైనం
- ఇటీవల పార్కు గేట్‌ను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలంటున్న స్థానికులు
- రాత్రి 10 నుంచి పోలీసు పెట్రోలింగ్ పెంచాలని డిమాండ్


పార్కుకు ఉన్న ఇనుప గేట్‌ను ధ్వంసం చేసిన దృశ్యం



హెచ్ఏఎల్ పార్కు ముఖద్వారం


పార్కులో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని హెచ్ఏఎల్ పార్కు దగ్గర రాత్రి సమయంలో విచ్చలవిడిగా అసాంఘిక కార్యకాలపాలు జరుగుతున్నాయని... పార్కు పరిసరా ప్రాంతాలకు వెళ్లాలంటే భయందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో పార్కులోకి వెళ్లేందుకు పార్కుకు ఉన్న ఇనుప గేట్‌ను ధ్వంసం చేశారు. రాత్రి 11 దాటిందంటే గుంపులు గుంపులుగా పార్కు వద్దకు చేరుకుని గంజాయి, డ్రగ్స్, తీసుకుంటున్నారనే అనుమానాలు స్థానికుల్లో మొదలయ్యాయి. మద్యంతో సహా తినుబండారాలు, యువకులకు కావాల్సిన ప్రతి వస్తువు దొరకడంతో తెల్లవారుజాము వరకు అక్కడే ఉంటున్నారు. రాత్రి వేళల్లో అటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు.

పార్కు ముఖద్వారానికి అడ్డుగా వాహనాల పార్కింగ్, దుకాణాలు

పార్కు ముఖద్వారానికి ముందు వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. పక్కనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వాటి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పార్కు లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చీకటి పడిదంటే చాలు పార్కులో ఏమి జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. తక్షణమే జీహెచ్ఎంసీ అధికారులు పార్కు ముందు వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే పార్కులో రాత్రి సమయంలో ఎవరూ వెళ్లకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పార్కులో నీటి కటకట..

హెచ్ఏఎల్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసిన అధికారులు పచ్చదనం పెంపొందించడంలో విఫలమయ్యారు. మహిళలతో పాటు పురుషులకు టాయిలెట్లు ఏర్పాటు చేశారు. కానీ నీళ్లు లేక టాయిలెట్లు దుర్గంధంగా మారాయి. పార్కులో ఉన్న బోరుబావులు మోటర్లను జీహెచ్ఎంసీ సిబ్బంది వేరే ప్రాంతంలోని పార్కులో బిగించేందుకు తీసుకెళ్లి ఇప్పటి వరకు బిగించలేదు. దీంతో పార్కులో నీటి కటకట తీవ్రమయ్యింది. అధికారులు పార్కులో మోటర్లను ఎందుకు బిగించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి...

పార్కు ఆవరణలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు. పార్కు చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే రాత్రుల్లో అక్కడికి వచ్చే వారిని కట్టడి చేయొచ్చని చెబుతున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి..

పార్కులో ఉన్న కమ్యూనిటీహాల్‌లో ఇండోర్ గేమ్స్‌కు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి పచ్చదనం పెంచాలంటున్నారు. పార్కును పరిశుభ్రంగా ఉంచేందుకు పనివాళ్లను, వాచ్‌మెన్లను నియమించాలని కోరుతున్నారు. పార్కు నిర్వహణను అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా శృంగేరి శారద మఠం వార్షికోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద మఠం 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభం సందర్భంగా శ్రీ ఆది శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన, గణపతి పూజ, కలశ స్థాపన, రుత్విక్‌వరణంతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణాధికారి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు. ఈ వార్షికోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం


బసవతారకం ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న ఉత్కాల జనని సేవా సమితి నాయకులు

మోతీనగర్: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని ఉత్కాల జనని సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీరన్ కుమార్ దాస్ పేర్కొన్నారు. ఆదివారం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా నాలుగో ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదానం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వికాస్, జుదిస్త, పప్పుని బీర, సరితా బీర, రాజన్ సాహు మంజు తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన చెట్ల కొమ్మలు.. ఎగిసిపడిన మంటలు.!

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి విద్యుత్ హైటెన్షన్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో మంటలు ఎగిసి పడ్డాయి. ఆటోల కోసం ప్రయాణికులు ఆ ప్రాంతంలో నిలబడతారు. ఆదివారం కావడంతో అక్కడ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


పర్వత్‌నగర్‌లో విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ పడటంతో ఎగిసిపడిన మంటలు

తీన్‌మార్ మల్లన్నకు మాలల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు జరిగే (27న) పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్‌మార్ మల్లన్నకు తెలంగాణ మాల స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చినేని వెంకట్ ఆదివారం మద్దతు ప్రకటించారు. తీన్‌మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. పాలన పదవుల్లో సామాజిక న్యాయాన్ని పాటిస్తున్న సీఎంకు మాలల మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు.

టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందించిన కాలనీవాసులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలని, త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీకి వినతి పత్రాన్ని అందించారు. ఆదివారం ఆయన నివాసంలో కాలనీవాసులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో పలు సమస్యలు నెలకొన్నాయని, అసంపూర్తిగా మిగిలి పోయిన సీసీరోడ్లను వేయాలని, కరెంట్ అంతరాయంపై చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలను ఏర్పాటు చేసేలా చూడాలని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ టీఎన్‌జీఓకాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీలో నెలకొన్న పలు సమస్య లను త్వరితగతిన పరిష్కరించేందుకు దశలవారీగా అన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా చేస్తామన్నారు. తాగునీటిని కుళాయిల ద్వారా ఎక్కువ ప్రెజర్‌తో విడుదల చేసేలా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా నీరు వదలడం జరుగుతుందన్నారు. అంసపూర్తిగా మిగిలిన సీసీరోడ్లను పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ, టీఎన్‌జీఓకాలనీ వాసులు సుధాకర్, సంజీవయ్య, సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు..

తాగునీరు రోడ్డుపాలు



కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు



మోతీనగర్ చౌరస్తాలో పైపులైన్ నిర్మాణ పనులతో లీకవుతున్న తాగునీరు

మోతీనగర్: ఎర్రగడ్డ డివిజన్ జలమండలి పరిధిలోని మోతీనగర్ చౌరస్తాలో 450 ఎంఎం పైపులైన్ పనులు నత్తనడకన కొనసాగటంతో మంజీరా నీరు లీకై రోడ్డుపై వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా పైపులైన్ పనులను వేగవంతంగా చేపట్టాలంటున్నారు. ఈ విషయమైన జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పనులు చేపట్టే సమయంలో వివిధ కేబుల్స్ అడ్డుగా రావటంతో అంతరాయం కలుగుతోందన్నారు. వారం లోపల పనులను శాశ్వతంగా పూర్తి చేసి లీకేజీలు లేకుండా శాశ్వత మరమ్మతులు చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలతో తెలిపారు. మైత్రినగర్ ఫీడర్, ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని సైనా గార్డెన్స్ ప్రాంతం, మైత్రినగర్, విజ్ఞానపురి కాలనీ, మైత్రినగర్ ఇండస్ట్రియల్ ప్రాతం, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు...

◆ మాధవరంనగర్ ఫీడర్ పరిధిలోని దీనబంధుకాలనీ, మాధవరంనగర్ కాలనీ, కమల ప్రసన్ననగర్ కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు...

◆ జలకన్య ఫీడర్ పరిధిలోని జలకన్య, భూదేవి హిల్స్, తులసి నగర్, శివ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వివేక్‌నగర్ ఫీడర్ పరిధిలో....

◆ మూసాపేట: వివేక్‌నగర్ ఫీడర్ పరిధిలోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్, వివేక్‌నగర్, ఓమ్ని ఆసుపత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ ఆర్‌వీ లక్ష్మి అపార్టుమెంట్స్, వివేక్‌నగర్, న్యూ బాలాజీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ కేపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలోని హనుమాన్ ఆలయం, మయూరి మార్గ్, 4వ ఫేజ్ మెయిన్ రోడ్డు, చౌదరి మెస్ ప్రాతం, వాటర్ ట్యాంక్ ప్రాంతం, శ్యామ్ ముఖర్జీ పార్కు, కేపీహెచ్‌బీ రోడ్ నం.5 ప్రాంతంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

◆ ఎంఐజీ 295, సుబ్బయ్య హోటల్, ఎంఐజీ 407, మమత హాస్పిటల్, మధుసూదన్ హాస్పిటల్, కేపీహెచ్‌బీ 3వ ఫేజ్, రోడ్ నం.5 ప్రాంతం, ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1, కేపీహెచ్‌బీ బస్‌స్టాప్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ట్రామా కేర్‌లో నిమ్స్ ప్రత్యేకం

లక్డీకాపూల్: అత్యవసర వైద్య సేవల్లో నిమ్స్ ప్రత్యేకమని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. ట్రామా, క్రిటికల్ కేర్‌పై నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆదివారం నిమ్స్ ట్రామా ఐదవ అంతస్తు ఆడిటోరియంలో ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీడీ కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ ట్రామా అండ్ క్రిటికల్ కేర్ సొసైటీ (ఐటీఏసీసీఎస్) సహకారంతో ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ అష్మా శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ... ఎమర్జెన్సీ మెడిసిన్‌లో స్పెషాలిటీ సేవలను మరింత విస్తరింపచేయాలన్నారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగాధిపతి ప్రొఫెసర్ అష్మా శర్మ, డిప్యూటీ మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్, ఎమర్జెన్సీ సీనియర్ వైద్యులు ముబాశీర్ సోహైల్ పాల్గొన్నారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమంలో ఏవిధంగా అయితే అన్ని వర్గాలు ఐక్యమై పోరాడామో బీసీ హక్కుల సాధన కోసం యావత్ బీసీ సమాజం ఐక్యంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. బీసీ సమాజ్ వ్యవస్థాపకులు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవులు మాట్లాడుతూ... భవిష్యత్‌తో బీసీలు అందరూ ఏకమై రాజ్యాధికారం దిశగా ముందుకు అడుగులు వెయ్యకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకారంగా మారే పరిస్థితి ఉందన్నారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ... కుల గణన చెయ్యకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని కుల సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులను ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

జూన్ 9న ప్రతిభా పురస్కారాల ప్రదానం

పంజగుట్ట: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో జూన్ 9వ తేదీన బిర్లా ఆడిటోరియంలో 10వ తరగతి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. తమ కులంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి 10 జీపీఏ నుంచి 9 జీపీఏ వరకు వచ్చినవారికి, ప్రైవేట్ పాఠశాలల్లో 10 జీపీఏ నుండి 9.2 జీపీఏ వచ్చిన విద్యార్థులందరికీ ప్రతిభా పురస్కారాలతో సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత 10 సంవత్సరాలుగా తమ యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం నుంచి సురగాని హిమబిందు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ సాధించింది. సీనియర్ అధ్యాపకురాలు ప్రొ.కేఎం ప్రవీణ పర్యవేక్షణలో క్వెస్ట్ ఫర్ ఐడెంటిటీ ఇన్ ద ట్రాన్స్‌లేటెడ్ వర్క్స్ ఆఫ్ మహాశ్వేత దేవి, ఊర్మిళ పవార్, అరుపకలిత పతంజాలి అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. కామరెడ్డిలో ప్రభుత్వ గురుకుల డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న హిమబిందును పలువురు అభినందించారు.